నేటి మ్యాచ్‌లు | దక్షిణాఫ్రికా X నేపాల్ – సెయింట్ విన్సెంట్ – ఉ. 5.00 | న్యూజిలాండ్ X ఉగాండా – తరౌబా – ఉ. 6.00 | భారత్ X కెనడా – ఫ్లోరిడా – రా. 8.00 | నమీబియా X ఇంగ్లండ్ – అంటిగ్వా – రా. 10.30

పాక్ ఆశలపై నీళ్లు

వర్షంతో యూఎస్ఏ-ఐర్లాండ్ పోరు రద్దు

సూపర్-8కు చేరుకున్న అమెరికా

ఫ్లోరిడా: పాకిస్థాన్ భయపడ్డదే నిజమైంది! వరుసగా రెండు మ్యాచ్‌లలో ఓడి ఆదిలోనే సూపర్-8 రేసులో వెనుకబడ్డ బాబర్ సేనకు వరుణుడు అనూహ్యమైన షాకిచ్చాడు. లాడర్‌హిల్ వేదికగా శుక్రవారం జరగాల్సిన యూఎస్ఏ-ఐర్లాండ్ మ్యాచ్ వర్షం కారణంగా టాస్ కూడా పడకుండానే రద్దైంది. దీంతో భారత్ (6) తర్వాత అత్యధిక పాయింట్ల (5)తో అమెరికా సూపర్-8 దశకు అర్హత సాధించింది. పాక్ ఖాతాలో 2 పాయింట్లే ఉన్నాయి. అమెరికా ముందంజ వేయడంతో ఈనెల 16న ఐర్లాండ్‌తో పాకిస్థాన్ ఆడబోయే మ్యాచ్ నామమాత్రమే. ఇదిలా ఉండగా పొట్టి ప్రపంచకప్ పోరులో సహ ఆతిథ్య దేశంగా ఉండి తొలిసారి ఈ మెగా టోర్నీ ఆడుతున్న అమెరికా.. మొదటి ప్రయత్నంలోనే సూపర్-8కు చేరడం విశేషం. దీంతో ఆ జట్టు 2026లో భారత్/శ్రీలంక వేదికగా జరగాల్సిన టీ20 వరల్డ్ కప్‌కూ అర్హత సాధించినట్టైంది

సెయిలింగ్ రెగెట్టా విజేత నార్తర్న్ కమాండ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హుసేన్‌సాగర్ వేదికగా జరిగిన ఈఎమ్‌ఈ సెయిలింగ్ రెగెట్టా చాంపియన్‌షిప్‌లో నార్తర్న్ కమాండ్ జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారంతో ముగిసిన టోర్నీలో నార్తర్న్ కమాండ్ 7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా, సౌత్ వెస్టన్ కమాండ్(8), సదరన్ కమాండ్(11) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఐఎల్‌సీఏ7 విభాగంలో గోవింద్ బైరాగి స్వర్ణ పతకంతో మెరువగా, విష్ణు, యమన్‌దీప్ రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఐఎల్‌సీఏ 6 కేటగిరీలో కిరణ్‌కు పసిడి దక్కగా, ధర్మేందర్‌కు రజతం, గౌతమ్‌కు కాంస్యం లభించాయి. విజేతలకు మేజర్ జనరల్, డిప్యూటీ కమాండెంట్ అజయ్ శర్మ ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టోర్నీలో పాల్గొన్న సెయిలర్లందరికీ శుభాకాంక్షలు. దేశంలోని వివిధ ఆర్మీ యూనిట్ల నుంచి ఈ రెగెట్టా టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఇది కేవలం అనుభవం కల్గిన సెయిలర్లకే కాదు.. కొత్త వాళ్లు తమ నైపుణ్యాన్ని పెంచుకునేందుకు బాగా ఉపయోగపడుతుంది. రానున్న హైదరాబాద్ సెయిలింగ్ వీక్‌లో రాణించడం ద్వారా ఆర్మీ, భారత జట్టులో చోటు దక్కించుకునేందుకు మంచి అవకాశముంది' అని అన్నారు.

ముగిసిన భారత్ పోరాటం

క్వార్టర్స్‌లోనే వెనుదిరిగిన షట్లర్లు

సిడ్నీ: ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్ సూపర్-500 టోర్నీలో భారత షట్లర్ల టైటిల్ వేట క్వార్టర్స్ పోరుతోనే ఆగిపోయింది. శుక్రవారం జరిగిన పురుషుల, మహిళల, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో మన షట్లర్లు ఓడటంతో భారత్‌కు నిరాశ తప్పలేదు. పురుషుల సింగిల్స్‌లో అగ్రశ్రేణి ఆటగాడు హెచ్ఎస్ ప్రణయ్.. 21-19, 21-13తో నరోక (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యాడు. సమీర్ వర్మను 12-21, 13-21తో లిన్ చున్ యీ (చైనీస్ తైపీ) బోల్తా కొట్టించాడు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 17-21, 12-21తో పై యు-పొ (చైనీస్ తైపీ)కు తలవంచగా మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్-సిక్కిరెడ్డి జోడీ 12-21, 12-21తో జెన్ బంగ్ - వీ యా జిన్ (చైనా) చేతిలో ఓడింది.

వరుణుడు కరుణించేనా..?

నేడు భారత్, కెనడా మ్యాచ్

కలవరపెడుతున్న కోహ్లీ ఫామ్

టీ20 ప్రపంచకప్ టోర్నీ

ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్‌లో భారత్ వరుస విజయాల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఐర్లాండ్‌పై శుభారంభం చేసిన టీమ్‌ఇండియా ఆ తర్వాత చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై చిరస్మరణీయ విజయంతో కదంతొక్కి ఆతిథ్య అమెరికాను మట్టికరిపించి హ్యాట్రిక్ ఖాతాలో వేసుకుంది. కీలకమైన సూపర-8కు ముందు పసికూన కెనడాతో భారత్ తలపడనుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒకటి గెలిచిన కెనడా..టైటిల్ ఫెవరేట్లలో ఒకట్లైన భారత్‌కు ఏమాత్రం పోటీనిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఐపీఎల్‌లో సూపర్‌ఫామ్‌తో మెరుపులు మెరిపించిన విరాట్ కోహ్లీ..మెగాటోర్నీలో ఫామ్‌లేమితో సతమతమవుతుండటం భారత్‌ను ఇబ్బంది పెడుతున్నది. మ్యాచ్ సజావుగా సాగేందుకు వరుణుడు కరుణిస్తాడా అన్నది ప్రశ్నగా మారింది.

లాడర్‌హిల్(యూఎస్ఏ): టీ20 ప్రపంచకప్ కీలక దశకు చేరుకుంది. అందని ద్రాక్షగా ఊరిస్తూ వస్తున్న పొట్టి కప్‌ను ఎలాగైనా ఒడిసిపట్టుకోవాలన్న పట్టుదలతో ఉన్న టీమ్‌ఇండియా వరుస విజయాలతో దూసుకెళుతున్నది. ఇప్పటికే సూపర-8కు అర్హత సాధించిన భారత్..తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో శనివారం కెనడాతో తలపడనుంది. న్యూయార్క్ నసావు స్టేడియంలో లోస్కోరింగ్ మ్యాచ్‌లను నిలబెట్టుకున్న రోహిత్‌సేన..కెనడాతో అదే సమిష్టి ప్రదర్శన కనబర్చాలని చూస్తున్నది. ముఖ్యంగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫామ్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతున్నది. ఐపీఎల్‌లోపరుగుల వరద పారించిన కోహ్లీ మెగాటోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఐదు పరుగులకే పరిమితమయ్యాడు. కెప్టెన్ రోహిత్‌శర్మతో కలిసి ఓపెనింగ్‌కు వచ్చిన కోహ్లీ మెరుగైన శుభారంభాలను అందించలేకపోయాడు. కెనడాతో పోరులోనైనా కోహ్లీ గాడిలో పడతాడా అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు స్పిన్ ద్వయం చాహల్, కుల్దీప్ యాదవ్ జట్టులోకి వచ్చే అవకాశం కనిపిస్తున్నది. మూడు మ్యాచ్‌ల్లో జడేజా ఒక వికెట్‌కే పరిమితం కాగా, అక్షర్‌పటేల్ కూడా పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు.

కెనడా పోటీనిచ్చేనా:

అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్న కెనడా..భారత్‌ను నిలువరిస్తుందా అనేది చూడాలి. పటిష్ఠమైన బ్యాటింగ్ లైనప్ కల్గిన టీమ్‌ఇండియాను ఎదుర్కొవడం కెనడాకు తలకు మించిన భారమే కానుంది.

వాతావరణం: ఉరుములు, మెరుపులతో శనివారం రోజంతా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

జట్ల అంచనా: భారత్: రోహిత్(కెప్టెన్), కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, బుమ్రా/సిరాజ్/కుల్దీప్/అర్ష్‌దీప్‌సింగ్.

ఫరూఖీ (3/16)

అఫ్గాన్ ముందుకు.. కివీస్ ఇంటికి

తొలిసారి సూపర-8 చేరిన అఫ్గానిస్థాన్ ● ఒమన్‌పై విజయంతో రేసులోకొచ్చిన ఇంగ్లండ్

తరౌబా: గత ఏడాది కాలంగా నిలకడైన విజయాలతో ప్రపంచ క్రికెట్‌లో అగ్రశ్రేణి జట్లకు సైతం షాకులిస్తున్న అఫ్గానిస్థాన్.. టీ20 వరల్డ్ కప్ తాజా ఎడిషన్‌లో సూపర-8కు చేరింది. పొట్టి ప్రపంచకప్‌లో ఆ జట్టు సూపర-8 దశకు అర్హత సాధించడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. శుక్రవారం తరౌబా వేదికగా పపువా న్యూగినీ (పీఎన్‌జీ)తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంతో రషీద్ ఖాన్ సేన తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. గ్రూప్-సీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ అఫ్గాన్ గెలవడంతో అగ్ర జట్టు న్యూజిలాండ్ కథ గ్రూప్ స్టేజ్‌తోనే ముగిసింది. ఆ జట్టు రెండు మ్యాచ్‌లలోనూ ఓడి ఇంటిదారి పట్టింది. ఇలా టీ20 ప్రపంచకప్‌లో లీగ్ దశలోనే కివీస్ నిష్క్రమించడం ఇదే తొలిసారి.

బౌలర్లు అదుర్స్:

మొదట బ్యాటింగ్ చేసిన పీఎన్‌జీని అఫ్గాన్ బౌలర్లు 19.5 ఓవర్లలో 95 పరుగులకే ఆలౌట్ చేశారు. ఆ జట్టు పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీ (3/16) మరోసారి విజృంభించగా నవీన్ ఉల్ హక్ (2/4) రాణించడంతో ప్రత్యర్థి బ్యాటర్లు విలవిల్లాడారు. పీఎన్‌జీ తరపున కిప్లిన్ డొరిగ (27) టాప్ స్కోరర్. స్వల్ప లక్ష్యాన్ని అఫ్గాన్ 15.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. గుల్బాదిన్ నయీబ్ (36 బంతుల్లో 49 నాటౌట్) దూకుడుగా ఆడాడు. ఫారూఖీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

రేసులోకి ఇంగ్లండ్:

వర్షం కారణంగా స్కాట్లాండ్ మ్యాచ్ అర్ధాంతరంగా రద్దై ఆసీస్ చేతిలో ఓడటంతో సూపర-8 బెర్తు ప్రమాదంలో ఉన్న నేపథ్యంలో పసికూన ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ చెలరేగింది. అంటిగ్వా వేదికగా జరిగిన మ్యాచ్‌లో మొదట ఒమన్‌ను 47 పరుగులకే ఆలౌట్ చేసిన బట్లర్ సేన ఆ తర్వాత 3.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకోవడమే గాక నెట్ రన్‌రేట్‌ను భారీగా పెంచుకుంది. నాలుగు వికెట్లు తీసిన ఆదిల్ రషీద్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది. ఆస్ట్రేలియా-స్కాట్లాండ్ మధ్య జరిగే మ్యాచ్‌లో ఆసీస్ గనక ఓడితే డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ కథ ముగిసినట్టే!

రషీద్ (4/11)

సెమీస్‌లో నాగల్

పెరుగియ: భారత యువ టెన్నిస్ సంచలనం సుమిత్ నాగల్ వరుస విజయాలతో పెరుగియ చాలెంజర్ టోర్నీలో సెమీఫైనల్ చేరాడు. ఇటలీ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా శుక్రవారం జరిగిన క్వార్టర్స్ పోరులో నాగల్ 6-4, 7-5తో అన్‌సీడెడ్ పోలండ్ ఆటగాడు మక్స్ కస్నికోవ్‌స్కిని వరుస సెట్లలో ఓడించాడు.

ఒక్క రూపాయి తీసుకోకుండానే..

ఢిల్లీ: గతేడాది భారత్ వేదికగా ముగిసిన వన్డే వరల్డ్ కప్‌లో అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టుకు మెంటార్‌గా వ్యవహరించిన భారత మాజీ క్రికెటర్ అజయ్ జడేజా ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా సేవలందించాడట. ఈ విషయాన్ని స్వయంగా అఫ్గాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) నసీబ్ ఖాన్ శుక్రవారం వెల్లడించాడు. జడేజా అందిస్తున్న సేవలకు డబ్బులు తీసుకోవాలని అతడిని పలుమార్లు కోరినా జడేజా మాత్రం.. 'మీరు బాగా ఆడితే చాలు. అదే మీరు నాకిచ్చే రివార్డు' అని చెప్పి తిరస్కరించాడట.

రికర్వ్ జట్టుకు నిరాశ

అంటాల్య: పారిస్ ఒలింపిక్స్‌లో కోటా దక్కించుకునేందుకు ఆఖరి అవకాశమైన ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత మహిళల రికర్వ్ జట్టు నిరాశపరిచింది. టర్కీలోని అంటాల్య వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో దీపికా కుమారి, భజన్ కౌర్, అంకితా భకత్‌తో కూడిన భారత జట్టు ప్రి క్వార్టర్స్‌లో 3-5తో ఉక్రెయిన్ చేతిలో ఓటమిపాలైంది. ఉక్రెయిన్‌తో ఓడినా భారత్‌కు ఒలింపిక్స్‌లో బెర్తు సాధించేందుకు మరో అవకాశముంది. ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో 8వ స్థానంలో ఉన్న భారత్.. ర్యాంకుల ఆధారంగా విశ్వక్రీడల్లో బరిలోకి దిగే చాన్స్ ఉంది.

చిత్రం

లేడీ బాస్ హంగామా

యువతరంలో మంచి క్రేజ్ ఉన్న కథానాయికల్లో శ్రీలీల ఒకరు. అరంగేట్రం చేసిన అనతికాలంలోనే ఈ అచ్చ తెలుగు అందం భారీ చిత్రాల్లో అవకాశాలను సంపాదించుకొని సత్తా చాటింది. ప్రస్తుతం ఈ భామ నితిన్ సరసన 'రాబిన్‌హుడ్' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్నది. డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం కథానాయిక శ్రీలీల పుట్టిన రోజుని పురస్కరించుకొని లేడీ బాస్ నీరా వాసుదేవ్‌గా ఆమె పాత్రను పరిచయం చేస్తూ వీడియో విడుదల చేశారు. 'సునామీలో టీ సైలెంట్‌గా ఉండాలి. నా ముందు నువ్వు సైలెంట్‌గా ఉండాలి' అని శ్రీలీల చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ సినిమాలో శ్రీలీల కాస్త గర్విష్టి అయిన లేడీ బాస్‌గా కనిపిస్తుందని, నితిన్ క్యారెక్టర్‌కు పూర్తి భిన్నంగా ఆమె పాత్ర సాగుతుందని చిత్ర బృందం పేర్కొంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: వెంకీ కుడుముల.

నాలుగురెట్ల వినోదం కోసం..

వెంకటేష్, వరుణ్‌తేజ్ కథానాయకులుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'ఎఫ్-2' 'ఎఫ్-3' చిత్రాలు హోల్‌సమ్ కామెడీ ఎంటర్‌టైనర్స్‌గా ప్రేక్షకులకు వినోదాన్ని పంచాయి. 'ఎఫ్-3' విడుదల అనంతరం ఈ సినిమా ఫ్రాంఛైజీని కొనసాగిస్తామని నిర్మాత దిల్ రాజు తెలిపారు. ఈ నేపథ్యంలో 'ఎఫ్-4' ఎప్పుడు పట్టాలెక్కుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకు రంగం సిద్ధమైనట్లుగా తెలిసింది. ఈ చిత్రంలో వెంకటేష్, వరుణ్‌తేజ్ పాటు మరో అగ్ర హీరో కూడా నటిస్తారని సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని చెబుతున్నారు.

పరమేశ్వరుడి ఆజ్ఞ 'కన్నప్ప'

'కన్నప్ప ప్రతి తరానికి కనెక్ట్ అవుతుంది. ధూర్జటి విరచిత శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించాం. వివిధ భాషల్లోని అగ్ర నటుల్ని ఈ చిత్రంలో భాగం చేశాం' అన్నారు సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు. శుక్రవారం జరిగిన 'కన్నప్ప' టీజర్ రిలీజ్ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంచు విష్ణు టైటిల్ రోల్‌లో ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మంచు మోహన్ బాబు మాట్లాడుతూ 'ప్రభాస్ కోసం కృష్ణంరాజు ఈ కథను సిద్ధం చేశారు. మేము అడిగిన వెంటనే ఆయన కథను ఇచ్చారు. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే ఈ సినిమా తీయడానికి ముందుకొచ్చాం. నిర్మాతగా ఈ సినిమా నాకు ఎంతో సంతృప్తినిస్తున్నది' అన్నారు. కన్నప్ప మైథాలజీ చిత్రం కాదని, రెండో శతాబ్దంలో చోళ రాజుల కాలంలో జరిగిన నిజమైన కథ ఇదని, చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మంచు విష్ణు తెలిపారు. అపరశివ భక్తుడి కథగా 'కన్నప్ప' అందరిని ఆకట్టుకుంటుందని దర్శకుడు ముఖేష్‌కుమార్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

ప్రతిభావంతుల్ని ప్రోత్సహిస్తాం

సినీరంగంలోకి రావాలనుకునే ఔత్సాహికులను ప్రోత్సహించడమే ఆర్జీవీ యువర్ ఫిల్మ్ కాంటెస్ట్ లక్ష్యమని చెప్పారు దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ కాంటెస్ట్ వివరాలను వెల్లడించారు. రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ 'ప్రతిభ ఉండి ప్రపంచానికి తెలియాల్సిన వారు చాలా మంది ఉన్నారు. ఇండస్ట్రీకి దూరంగా ఉంటూ అవకాశాలను పొందలేకపోతున్న వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ కాంటెస్ట్‌ను నిర్వహించాం. దీనికి 400 ఎంట్రీలు వచ్చాయి. వీటిని షార్ట్‌లిస్ట్ చేసి 11 షార్ట్‌ఫిల్మ్స్‌ను ఎంపిక చేశాం. సోషల్‌మీడియాలో ఓటింగ్ నిర్వహించి బెస్ట్ డైరెక్టర్‌గా ఎంపికైన వారికి మా సంస్థలో అవకాశం ఇవ్వబోతున్నాం. ఒక్క డైరెక్షన్ విభాగంలోనే కాదు కెమెరామెన్, మ్యూజిక్ డైరెక్షన్ ఇలా ప్రతి క్రాఫ్ట్‌లో టాలెంట్ ఉన్న వారిని ఎంపిక చేస్తున్నాం. లఘు చిత్రాల్లో నిర్మాణ విలువల కంటే కాన్సెప్ట్‌ను ఎంత బాగా ప్రజెంట్ చేశారనే అంశాన్నే పరిగణలోకి తీసుకున్నాం' అన్నారు.

'విశ్వంభర'తో టాలీవుడ్ ఎంట్రీ

చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న సోషియో ఫాంటసీ థ్రిల్లర్ 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. భారీ సాంకేతిక హంగులతో పంచభూతాల కాన్సెప్ట్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ భాగం కాబోతున్నారు. రంగ్ దే బసంతి, డాన్-2, డియర్ జిందగీ వంటి చిత్రాలతో కునాల్ కపూర్ మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఆయన పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఛోటా కె నాయుడు, సంగీతం ఎం.ఎం.కీరవాణి, రచన-దర్శకత్వం: వశిష్ఠ.

స్త్రీద్వేషి..ఈ భవభూతి

ప్రతి సినిమాలో పాత్రలపరంగా వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నారు యువ హీరో శ్రీవిష్ణు. ఇటీవల 'ఓం భీమ్ బుష్' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించిన ఆయన తాజాగా 'శ్వాగ్' చిత్రంలో నటిస్తున్నారు. హసిత్ గోలి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శుక్రవారం వీడియో గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో శ్రీవిష్ణు భవభూతి అనే స్త్రీ ద్వేషి పాత్రలో కనిపించారు. అతని లుక్స్, మేకోవర్ సరికొత్తగా ఉంది. భవభూతి పాత్రలో శ్రీవిష్ణు అద్భుతమైన నటనను కనబరిచాడని, ఆద్యంతం వినోదాత్మక అంశాలతో సినిమా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. రీతూవర్మ, మీరా జాస్మిన్, దక్ష నగార్కర్, శరణ్యప్రదీప్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్ సాగర్, రచన-దర్శకత్వం: హసిత్‌గోలి.

ప్రియమైన నాన్నకు..

చైతన్యరావు, యష్ణ చౌదరి జంటగా నటించిన చిత్రం 'డియర్ నాన్న'. అంజి సలాది దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాకేష్ మహంకాళి నిర్మించారు. ఈ నెల 14 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్నది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కరోనా బ్యాక్‌డ్రాప్‌లో తండ్రీకొడుకుల అనుబంధానికి దర్పణంలా ఈ సినిమా ఉంటుంది. వారిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు హృదయానికి హత్తుకుంటాయి. ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. ఫాదర్స్‌డేకు పర్‌ఫెక్ట్ గిఫ్ట్‌లాంటి సినిమా ఇది' అన్నారు. సీవీఎల్ నరసింహ, ఆదిత్య వరుణ్, వినీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అనిత్ కుమార్ మదాడి, సంగీతం: గిఫ్టన్ ఎలియాస్, దర్శకత్వం: అంజి సలాది.

తుఫాన్‌లా చెలరేగిపోతాడు

విజయ్ ఆంటోనీ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ ఈ చిత్రానికి దర్శకుడు. కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మాతలు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ఫస్ట్ సింగిల్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'తుఫాన్‌లా..' అంటూ సాగే ఈ పాటను భవ్యశ్రీ రాయగా.. విజయ్ ఆంటోనీ, అచ్చు రాజమణి కలిసి స్వరపరిచారు. హైమత్ మహమ్మద్ ఆలపించారు. హీరో పాత్రలోని సంఘర్షణని ఆవిష్కరిస్తూ ఈ పాటను తెరకెక్కించడం జరిందని మేకర్స్ చెబుతున్నారు. శరత్‌కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ, మేఘా ఆకాశ్, మురళీ శర్మ, పృథ్వీ అంబర్, శరణ్య పొన్వన్నన్ విజయ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి రచన, సినిమాటోగ్రఫీ, డైరెక్షన్: విజయ్ మిల్టన్.

బాల్య జ్ఞాపకాలను గుర్తుకు తెస్తుంది

జీవితపథంలో ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఎలాంటి బాదరబందీలు లేకుండా స్నేహితులతో ఉల్లాసంగా గడిపిన బాల్యం నాటి రోజులే గొప్పగా అనిపిస్తాయి. ఈ అంశం ప్రధానంగా రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదు వంశీ దర్శకుడు. నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటున్నది. శుక్రవారం టీజర్‌ను హీరో నితిన్ సోషల్‌మీడియా వేదికగా విడుదల చేశారు. ఇందులో ఓ మిత్రబృందం తాలూకు బాల్యాన్ని, యుక్తవయసులో వారు చేసిన సరదా సంగతులను చూపించారు. చివరగా ఊరిలో యువత ఎందుకు గొడవల్లోకి దిగుతారు. అందుకు కారణమేమిటనే అంశాలను తెరపై చూడాల్సిందేనంటూ ఆసక్తిగా టీజర్‌ను ముగించారు. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్ వర్మ, ప్రసాద్ బెహరా తదితరులు నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజు ఎడురోలు, సంగీతం: అనుదీప్‌దేవ్, రచన-దర్శకత్వం: యదు వంశీ.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.